సాక్షి వికారాబాద్

బుధవారం ၊ 28 ၊ జూన్ ၊ 2023



ఒక్క ప్రసవం చేస్తే ఒట్టు!

బషీరాబాద్ మండలంలో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నా ప్రసవాలు మాత్రం చేయడం లేదు. 8లో▸



తల్లడిల్లుతున్న తల్లి

ఐదేళ్లుగా భర్త జాడలేదు.. ఇదరు దివ్యాంగులున్న కుమారులతో ఆ తల్లి పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు.. 8లో▸



అధికం.. అనర్థం

రసాయన ఎరువులు అధికంగా వాడితే అనర్థమే అని వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

ముస్లిం బంధు ఇవ్వాల్సిందే



మాట్లాడుతున్న ఎంఐఎం నేత ఎస్‌బీ గుల్షన్

కొడంగల్ రూరల్ : ముఖ్యమంత్రి కేసీఆర్ ముస్లింల పట్ల చిన్న చూపు చూడటం సరైంది కాదని ఎంఐఎం పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బీ గుల్షన్ అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దళితబంధు తరహాలో ముస్లిం బంధును ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే ముస్లింలకు 12శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చి తొమ్మిదేళ్ల గడుస్తున్నా అమలుకు నోచుకోవడంలేదని అన్నారు. ముస్లింలను ఓటు బ్యాంకుగానే వినియోగించుకుంటున్నారని మండిపడ్డారు. సంక్షేమానికి చర్యలు తీసుకోవడంలేదని అన్నారు. ముస్లిం బంధు ఇవ్వని పక్షంలో రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ నాయకులు షేక్ రోమాన్, షేక్ అజర్, ఎండీ.ముర్తుజా, ముబీన్‌ఖాన్, సయ్యద్ ముస్తాఫా, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హస్తినలో గురునాథ్‌రెడ్డి

కాంగ్రెస్ అధిష్టానం పెద్దలతో భేటీ



కాంగ్రెస్ పెద్దలతో మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి

కొడంగల్: మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి సోమవారం ఢిల్లీ వెళ్లారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో కలిసి పార్టీ పెద్దలను కలిశారు. గురునాథ్‌రెడ్డి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారబోతున్నారనే వార్త కొడంగల్‌లో చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో ఆయన ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ పెద్దలను కలవడం ప్రాధాన్యత సంతరించుకొంది. సమీప భవిష్యత్తులో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. వచ్చే నెలలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగే భారీ బహిరంగ సభలో పార్టీలో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది. రాజకీయ అనుభవం ఉన్న నేత పార్టీ మారుతుండడంతో ఇక్కడి రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఇప్పటికే గ్రూపులుగా విడిపోయిన పార్టీల్లో కింది స్థాయి నాయకులు ఎలా ముందుకు వెళ్లాలో ప్రశ్నార్థకంగా మారిందని భావిస్తున్నారు.

జిప్సం ఫ్యాక్టరీలో ఆర్ఐ విచారణ

కలెక్టర్‌కు అందజేయనున్న నివేదిక



జిప్సం ఫ్యాక్టరీలో విచారణ చేపడుతున్న ఆర్ఐ బాల్‌రాజు

తాండూరు రూరల్: మండలంలోని జిప్సం ఫ్యాక్టరీలపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. రెండు రోజుల క్రితం గుంతబాసుపల్లికి చెందిన దస్తయ్యగౌడ్, జాఫర్ పటేల్, కాశప్పలు తహసీల్దార్ చిన్నప్పల నాయుడికి ఫ్యాక్టరీపై ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ బాల్‌రాజు మంగళవారం గుంతబాసుపల్లి శివారులో ఉన్న ఇండమ్ కెమ్ జిప్సం ఫ్యాక్టరీని పరిశీలించారు. ఫ్యాక్టరీ ప్రతినిధులతో మాట్లాడారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే ఫ్యాక్టరీలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామ శివారులో ఉన్న మరో ఫ్యాక్టరీని కూడా పరిశీలించారు. నివేదికను కలెక్టర్‌కు, తహసీల్దార్‌కు అందజేస్తానని తెలిపారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

బంట్వారం: చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తెల్లి లక్ష్మణ్‌యాదవ్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బీసీలకు రాజకీయంగా కనీస ప్రాతినిధ్యం లభించడం లేదన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం సేకరించిన గణంకాల ప్రకారం చట్ట సభల్లో బీసీల ప్రాతినిధ్యం 14 శాతం దాటలేదని ఆయన వివరించారు. జనాభాలో 56 శాతం బీసీలు ఉంటే చట్ట సభల్లో మాత్రం 14 శాతమే ప్రాతినిధ్యం వహించడం విచారకరమన్నారు. తెలంగాణాలో 119 శాసన సభ్యుల్లో బీసీలు కేవలం 21 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. రూ.లక్ష కోట్లతో సబ్ ప్లాన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగ బద్ధమైన హక్కులు కల్పించాలన్నారు.

ఒక్క చాన్స్ ప్లీజ్





మనోహర్‌రెడ్డి



విజయ్‌కుమార్



వడ్ల నందు



బి. కృష్ణ

'పార్టీలో పదేళ్లకుపైగా పని చేస్తున్నాం.. అధిష్టానాన్ని నమ్ముకుని ఉన్నాం.. ఇన్ని రోజులు పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా గెలుపు కోసం పని చేశాం.. గెలుపొందిన వారందరూ ప్రజావ్యతిరేకతనే మూటగట్టుకున్నారు.. విజయం కోసం అహర్నిశలు కష్టపడిన మమ్మల్ని అథఃపాతాళానికి తొక్కుతున్నారు. పక్క పార్టీలనుంచి వచ్చిన వారిని అందలమెక్కిస్తున్నారు.. అందుకే ఈసారి మాకు ఒక్క చాన్స్ ఇవ్వాలని' ఆశావహులు బీఆర్ఎస్ అధిష్టానానికి కోరుతున్నారు. మళ్లీ వారికే టికెట్లు ఇస్తే ఓడించి తీరుతామని తేల్చి చెబుతుండటం గమనార్హం.

ఆశావహుల విన్నపాలు

- దశాబ్దానికిపైగా బీఆర్ఎస్‌కు సేవలు
- ఎమ్మెల్యేలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత అంటూ సూచన
- జిల్లా మంత్రికి సైతం నివేదన
- సన్నిహితులతో ప్రత్యేక సమావేశాలు
- జిల్లా బీఆర్ఎస్‌లో హాట్‌హాట్ రాజకీయాలు

వికారాబాద్: బీఆర్ఎస్‌లో ఆశావహులు టికెట్ల కోసం గట్టి పట్టుపడుతున్నారు. టికెట్లు రాకుంటే పార్టీని వీడేందుకు సైతం వెనుకాడమని సన్నిహితులతో స్పష్టం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా సన్నిహితులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి భవిష్యత్ ప్రణాళికలు రచిస్తున్నారు. ఇప్పటికే ఈ విషయంలో జిల్లా మంత్రికి నివేదించారు. ఇటీవల ఆశావహు నేతలందరూ ధారూరు మండల పరిధిలో సమావేశం ఏర్పాటు చేయడంపై జిల్లాలో హాట్‌హాట్‌గా చర్చ జరుగుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార బీఆర్ఎస్‌లో వర్గపోరు తగ్గుతుందనుకుంటే మరింత తారాస్థాయికి చేరడం గమనార్హం. అయితే పార్టీ గెలుపు కోసం కృషిచేసిన అసమ్మతి (ఆశావహులు) నేతలను ఒకేతాటిపైకి తేవడంలో ఎమ్మెల్యేలు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ పథకాలు కేటాయించటంలో, పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడంలో వివక్ష చూపిస్తున్నందునే దూరం పెరుగుతుందనే వాదన ఉంది.

పరిగి నుంచి మనోహర్‌రెడ్డి..

బుయ్యని మనోహర్‌రెడ్డి ప్రస్తుతం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు డీసీసీబీ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. గతంలోనూ ఎమ్మెల్యే టికెట్ ఆశించిన ఆయన మహేశ్‌రెడ్డికి టికెట్ ఇవ్వటంతో వారితో కలిసి పని చేశారు. డీసీసీబీ చైర్మన్ అవకాశం రావటంతో ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి సైతం సహకరించారు. ఏడాదికాలంగా ఆయన నియోజకవర్గంలో అధికార బీఆర్ఎస్ నాయకులతో తనకంటూ ఓ వర్గాన్ని తయారు చేసుకున్నారు.. ఆ వర్గం పూర్తి గా ఎమ్మెల్యేకు దూరం కావడంతో పాటు ఆయన నిర్వహించే కార్యక్రమాల్లో సైతం పాల్గొనడంలేదు. ఇటు నియోజకవర్గంలో బలం పెంచుకుంటూనే అధిష్టానంతో సైతం దగ్గరవుతూ వచ్చారు. ఈ సారి తనకే టికెట్ ఇవ్వాలని అధిష్టానాన్ని అడుగుతున్నారు. టికెట్ నాకే వస్తుందని ప్రచారం కూడా చేసుకుంటున్నారు. టికెట్ ఇవ్వకుంటే తన వర్గంనేతలతో కలిసి పార్టీని వీడటంగాని, రెబల్‌గా అయినా సరే ఎమ్మెల్యేగా బరిలో ఉంటాననే సంకేతాలిస్తున్నారు.

కొడంగల్‌లోనూ..

కొడంగల్ నుంచి 2018 అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీ టికెట్ ఆశించి నిరాశచెందిన మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి ఏడాదిగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. ఆరు నెలలుగా తనకు లేదా తన కుమారుడు జగదీశ్వర్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని పార్టీ పెద్దలను అడుగుతూ వస్తున్నారు. మాట్లాడదాం అంటూ చెప్పిన అధిష్టానం నాన్చుతూ వస్తోంది. దీంతో ఇటీవల పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డితో ఆయన భేటీ అయ్యారు. తన కుమారులతో కలిసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు కూడా ప్రకటించిన నేపథ్యంలో ఇక ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవటం లాంఛనమే..

వికారాబాద్‌లో..

వికారాబాద్‌లోనూ స్థానిక ఎమ్మెల్యే ఆనంద్‌కు వ్యతిరేకంగా నేతలు టికెట్ కోసం పావులు కదుపుతున్నారు. ప్రస్తుత జెడ్పీ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయం నుంచి పార్టీలో ఉన్నారు. పార్టీ అధిష్టానంతో సైతం మంచి సంబంధాలున్నాయి. ఇక వడ్ల నందు సైతం ఉద్యమ సమయం నుంచి పార్టీలో ఉంటూ సేవలందిస్తున్నారు. మరో నాయకుడు బూమన్నొల్ల కృష్ణ సైతం టికెట్ రేసులో ఉన్నారు. ఇతను వామపక్ష పార్టీల్లో కొనసాగుతూ ఎన్నో ప్రజా ఉద్యమాల్లో పాల్గొంటూ టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక పార్టీలోకి వచ్చి పార్టీకి సేవలందిస్తున్నారు. వీరు ఇటీవల ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఓ వర్గాన్ని తయారు చేసుకుని తమకు టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్ సైతం మరోసారి టికెట్ ఆశిస్తూ ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

తాండూరులో శుభప్రద్‌పటేల్..



తెలంగాణ ఉద్యమ సమయంలో శుభప్రద్‌పటేల్ పార్టీలో కీలకంగా వ్యవహరించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా విద్యార్థి జేఏసీ చైర్మన్‌గా ఉంటూ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడటంలో తనవంతు కృషి చేశారు. ఆ సమయంలో ఆయనపై అనేక కేసులు సైతం నమోదయ్యాయి. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఆయనకు ఏ పదవి దక్కలేదు. ఎనిమిది సంవత్సరాల సుదీర్ఘకాలం ఎదరు చూసిన ఆయనకు గతేడాది కేసీఆర్ బీసీ కమిషన్ మెంబర్‌గా నామినేటెడ్ పదవిని కట్టబెట్టారు. అయితే తాండూరు ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తూ వస్తున్న ఆయన ఆరు నెలలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం టికెట్ ఆశిస్తున్న ఇద్దరు ముఖ్యుల సామాజిక వర్గం ఓట్ల కంటే తమ సామాజిక వర్గం ఓట్లు అధికంగా ఉన్నాయంటూ ఆయన ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నీతిబాహ్యమైన రాజకీయాలతో తాండూరు ప్రజలు విసిగిపోయిన నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా బీసీ అయిన తనకు టికెట్ కేటాయిస్తే పార్టీని మరోమారు గెలుపు తీరాలకు చేరుస్తానని ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి, చిత్రంలో అదనపు కలెక్టర్ తదితరులు

గ్రూప్–4కు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ నారాయణ రెడ్డి
- సంబంధిత అధికారులతో సమీక్ష

వికారాబాద్ అర్బన్: గ్రూప్ –4 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పరీక్షల నిర్వహణపై ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్లు, లైసెస్, రూట్ అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూలై 1న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పేపర్–1, మధ్యాహ్నం 2:30 నుంచి 5 గంటల వరకు పేపర్–2 పరీక్ష ఉంటుందన్నారు. జిల్లాలో మొత్తం 18,120 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. 67 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, పరిసర ప్రాంతంలో గల జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలని అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నియమ నిబంధనల మేరకు పరీక్ష కేంద్రాలలో పటిష్టమైన చర్యలు చేపట్టాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదని సూచించారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి ఎల్రక్టానిక్ పరికరాలు, సెల్ ఫోన్లు, అనుమతించరాదని అన్నారు. పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులు ఉదయం 9:45 గంటలు దాటితే, మధ్యాహ్నం 2:15 గంటల తరువాత ఎవరినీ అనుమతించరాదన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి గ్రూప్ –4 పరీక్ష సజావుగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సంచిత గంగ్వార్, జిల్లా రెవెన్యూ అధికారి అశోక్ కుమార్, డీఆర్‌డీఓ కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష సాయం జాబితాను సిద్ధం చేయండి

- కలెక్టర్ నారాయణ రెడ్డి

వికారాబాద్ అర్బన్: వెనుకబడిన తరగతుల కుల వృత్తుల కుటుంబాల వారికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించేందుకు ఈ నెల 29వరకు అర్హుల జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ మాట్లాడుతూ బీసీ లబ్ధిదారులకు ఆర్థిక సహాయం కింద జిల్లా వ్యాప్తంగా 11 వేల దరఖాస్తులను స్వీకరించామన్నారు. వచ్చిన దరఖాస్తుల్లో అర్హులను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. లబ్ధిదారుల ఎంపిక క్షేత్ర స్థాయిలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు పూర్తి బాధ్యతతో పరిశీలించి జాబితాను సిద్ధం చేయాలన్నారు. జాబితాను ఈ నెల 29 వరకు అందజేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండి జూన్ 2 నాటికి 55 సంవత్సరాలు పూర్తయిన వారు అర్హులన్నారు. ఐదేళ్ల కాలంలో సంక్షేమ శాఖల ద్వారా రూ.50 వేల రుణాలు పొందిన వారు సైతం అర్హులని తెలిపారు. కల్యాణలక్ష్మీ, షాది ముబారక్ పథకం పొందిన వారూ అర్హులని తెలిపారు. లబ్ధిదారులు కచ్చితంగా వెనుకబడిన కులాలకు చెందిన వారై కులవృత్తులు, చేతి వృత్తులపై ఆధారపడి ఉండాలన్నారు. దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలన ప్రారంభించాలన్నారు. నాలుగు నియోజకవర్గాలకు జిల్లా స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించామన్నారు.

అవుట్ సోర్సింగ్ పద్ధతిన ఏఎన్ఎం పోస్టులు

వికారాబాద్ అర్బన్: ఏఎన్ఎం ఉద్యోగాల కోసం అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేసేందుకు ఆసక్తి ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో ఏఎన్ఎం ఉద్యోగాల కోసం అవుట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేయాల్సి ఉంటుందన్నారు. 18 నుంచి 44 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. ఏఎన్ఎం కోర్సులో ఉతీర్ణులై ఉండాలని లేదా దానికి సమానమైన కోర్సులో అర్హత కలిగి ఉండాలన్నారు. మెరిట్ మార్కులు, టీడబ్ల్యూడి విద్యా సంస్థల్లో పనిచేసిన అనుభవానికి వెయిటేజ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి నెలకు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా రూ.. 22,750 వేతనం ఉంటుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చే నెల 3వ తేదీ నుంచి 13వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్: 86393 88553ని సంప్రదించాలన్నారు.

యువతను మేల్కొల్పేందుకే క్విజ్ పోటీలు

- 2న ఆన్‌లైన్ పరీక్షలు
- గెలుపొందిన వారికి బహుమతులు
- ఏఐసీసీ సభ్యుడు రమేశ్ మహరాజ్

తాండూరు: తెలంగాణ యువతను ప్రోత్సహించేందుకు కాంగ్రెస్ పార్టీ కార్యాచరణ చేపట్టిందని ఏఐసీసీ సభ్యుడు రమేష్ మహరాజ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. జులై 2న పరీక్షలు ఉంటాయన్నారు. ఈ పోటీలలో పాల్గొనే యువతీయువకులు 16 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వయసు వారై ఉండాలన్నారు. పోటీలో పాల్గొనే యువత జులై1వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.రిజిస్ట్రేషన్ పొందటానికి 76618 99899 కాల్ చేయాలన్నారు. అందుకు సంబంధించిన రెవరల్ కోడ్ 14080ను ఎంటర్ చేయాలన్నారు. పోటీల్లో గెలుపొందిన వారి కి ప్రతి నియోజకవర్గంలో ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులను అందిస్తామన్నారు. ప్రోత్సా హక బహుమతులను 40 మందికి అందిస్తామన్నారు. వివరాల కోసం 81429 03456 సంప్రదించాలని అన్నారు.

తుల్జా భవానీ సేవలో ఎమ్మెల్సీ

ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి బుధవారం మహారాష్ట్రలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన తుల్జాపూర్‌లోని తుల్జాభవానీ మాతను దర్శించుకున్నారు. సీఎం కేసీఆర్ మహారాష్ట్ర పర్యటనలో ఎమ్మెల్సీ ఉన్నారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్సీ వెంట నాయకులు పట్లోళ్ల నర్సింహులు, తాటికొండ పరిమళ్‌గుప్త, కరణం పురుషోత్తంరావు, రామకృష్ణ తదితరులున్నారు.

– తాండూరు



తుల్జాభవానీ ఆలయంలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి పూజలు

ఆర్టీసీ డిపోలో రక్తదానం



వికారాబాద్ ఆర్టీసీ డిపోలో రక్తదానం చేస్తున్న యువత

అనంతగిరి: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని వికారాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ బక్షినాయక్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం వికారాబాద్ డిపోలో వికారాబాద్ ఆర్టీసీ, రెడ్ క్రాస్ సొసైటీ ల సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని ఆయన కోరారు. రక్తదానం ఒక పవిత్ర కార్యమని అన్నారు. రక్తదానంపై ఎలాంటి అపోహాలు ఉండకూడదు అన్నారు. రక్తదానం చేస్తే ఆపదలో ఉన్నవారికి ఆ రక్తం ఎంతో పని చేస్తుందని వారి ప్రాణాలను కాపాడిన వారం అవుతామని ఆయన తెలిపారు. అనంతరం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి సాయి చౌదరి మాట్లాడుతూ ఎర్ర రక్త కణాల జీవితకాలం 110 నుంచి 112 రోజులు మాత్రమే అని ఈ కాలవ్యవధి అనంతరం అవి శరీరంలో నశించిపోతాయని, కనుక రక్తదానం చేయడం మంచిదని సూచించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ కోశాధికారి డాక్టర్ సత్యనారాయణ గౌడ్, ఆర్టీసీ సిబ్బంది ప్రభుత్వ రక్తనిధి కేంద్రం సిబ్బంది, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గడువులోపు చెల్లించకుంటే భారమే

- ఆస్తిపన్ను చెల్లింపునకు ఈ నెలాఖరు గడువు
- గడువు దాటితే 2 శాతం వడ్డీ
- ఆందోళనలో ప్రజలు.. వసూళ్లలో అధికారులు

వికారాబాద్ అర్బన్: మున్సిపాలిటీల్లో గడువులోగా ఆస్తి పన్ను చెల్లించకపోతే ఆలస్య రుసుం పేరుతో 2శాతం వడ్డీ వేసేందుకు మున్సిపల్ అధికారులు సిద్ధమయ్యారు. ఈ నెల 30లోపు సగం ఆస్తి పన్ను చెల్లించని వారికి ఈ వడ్డీ భారం తప్పదు. నిబంధనల ప్రకారం మున్సిపాల్టీలో భవన యజమానులు ప్రతి ఏటా రెండుసార్లు (ఆరు నెలలకు ఒక సారి) ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు అర్ధ సంవత్సరానికి చెందిన ఆస్తి పన్నును జూన్ నెలాఖరులోగా చెల్లించాల్సి ఉంటుంది. అయితే యజమానులు ఏటా ఆర్థిక సంవత్సరం చివరి నెలలైన ఫిబ్రవరి, మార్చిలోనే ఎక్కువగా పన్ను చెల్లిస్తున్నారు. ఆస్తి పన్ను చెల్లించే విషయంలో ప్రజలకు అవగాహన లేకపోవడంతో ఏటా వడ్డీ చెల్లించక తప్పడంలేదు. ఈ ఏడాది తప్పకుండా అర్ధ వార్షిక పన్ను వసూలు చేయాలనే లక్ష్యంతో మున్సిపల్ అధికారులు ఆ దిశగా ప్రయత్నం చేస్తున్నారు.



వికారాబాద్ మున్సిపల్ కార్యాలయం

యజమానులకు నోటీసులు

ఆస్తి పన్నును ముందస్తుగా వసూళ్ల చేసేందుకు మున్సిపల్ అధికారులు సంబంధిత యజమానులకు డిమాండ్ నోటీసులు పంపిస్తున్నారు. మున్సిపల్ బిల్ కలెక్టర్లను ఇంటింటికి ఒకటి రెండు సార్లు పంపి అర్ధ సంవత్సరం పన్ను చెల్లించాలని లేకుంటే అస్సలు పన్నుపై 2శాతం వడ్డీ పడుతుందని చెప్పిస్తున్నారు. అయితే ఆస్తిపన్ను చెల్లింపునకు అర్ధ వార్షిక సంవత్సరం ఈ నెలతో ముగుస్తుంది. ఇప్పుడు చెల్లించకుంటే వచ్చేనెల నుంచి అదనంగా రెండు శాతం వడ్డీ వసూలు చేయనున్నారు. యజమానులు వెంటనే మున్సిపల్ బిల్ కలెక్టర్లకు లేక ఆన్‌లైన్‌లో పన్ను చెల్లించుకోవడం మంచిదని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

ఐదుశాతం మినహాయింపు

ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నెలలో ప్రారంభం కాగా ఆస్తపన్ను చెల్లింపుపై పురపాలక శాఖ ఐదు శాతం రాయితీ అవకాశాన్ని కల్పించింది. అంటే ఈ ఏడాదికి సంబంధించిన పన్నును ఒకేసారి చెల్లిస్తే మొత్తం పన్నులో ఈ ఐదు శాతం రాయితీ వర్తిస్తుంది. దీంతో కొంత మంది యజమానులు ఆసక్తి చూపి పన్ను చెల్లించడంతో మున్సిపాల్టీలకు కొంత నిధులు సమకూరాయి. ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించినవారిని మినహాయిస్తే మిగిలిన వారంతా గడువులోగా పన్ను చెల్లింపకపోతే వడ్డీ భారం భరించాల్సిందే.

సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా ఆస్తిపన్ను చెల్లిస్తే ఎలాంటి వడ్డీ భారం పడదు. ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఒకేసారి ఆస్తిపన్ను చెల్లించడం కూడా భారమే. అందుకే అర్ధవార్షిక సంవత్సరంలో చెల్లిస్తే ఇంటి యజమానులకు భారం తగ్గుతుంది.

– శరత్ చంద్ర, వికారాబాద్, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

అక్రెడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

అనంతగిరి: జిల్లాలో మూడో విడత అక్రెడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించాలని టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కే శ్రీధర్ మాట్లాడుతూ.. గతంలో రెండు సార్లు జిల్లా సమావేశం నిర్వహించి జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చారని తెలిపారు. ఇంకా పలువురు జర్నలిస్టులకు కార్డులు రావాల్సి ఉన్నందున సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చుక్కయ్య, రవీందర్, రవి, ప్రశాంత్, ప్రవీణ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రచయిత ఉస్మాన్ అలీకి అభినందనల వెల్లువ


ఉస్మాన్ అలీని సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

పరిగి: మండలంలోని చిట్యాల ప్రాథమిక పాఠశాల హెచ్ఎం, రచయిత ఉస్మాన్ అలీని మంగళవారం మైనార్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు ఆడుతూ పాడుతూ.. నవ్వుతూ నవ్విస్తూ నైతిక విలువలతో బోధించడానికి అవసరమైన కథలతో ఒకటి నుంచి 5వ తరగతి వరకు లెవల్ -1, లెవల్ -2 పుస్తకాలను విద్యాశాఖ ముద్రించింది. ఈ పుస్తకాల్లో రచయితగా ఉస్మాన్ అలీకి చోటు దక్కింది. దీన్ని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉస్మాన్ అలీ మాతృభాష ఉర్దూ అయినా తెలుగులో చక్కటి కవితలు, గేయాలు రాయడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఆయన వల్ల జిల్లాకు మంచి వచ్చిందని కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మొయిజ్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి జహంగీర్, నాయకులు షఫీ, ఖదీర్, నజీర్, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

దోర్నాల్‌లో భారీ వర్షం


దోర్నాల్ గ్రామంలో కురుస్తున్న వర్షం

ధారూరు: మండలంలోని దోర్నాల్, నాగారం, అంపల్లి, గురుదోట్ల, శేరిగడ్డ తండా, జీడిగడ్డ తండాలో మంగళవారం వాన దంచి కొట్టింది. విత్తనాలు వేసి వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతన్నలకు ఊరట లభించింది.

స్విమ్మింగ్‌పూల్‌లో దూకి యువకుడి మృతి

పహాడీషరీఫ్: స్విమ్మింగ్ పూల్‌లో పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. బహదూర్‌పురా ఉస్మాన్‌పురాకు చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ నియాజ్ (23) తరచూ మద్యం సేవిస్తుండటంతో మూడు నెలల క్రితం తల్లి మందలించింది. అప్పటి నుంచి ఇంటికి వెళ్లడం మానేశాడు. హాజిరాబేగంను వివాహం చేసుకొని అద్దె ఇంటి కోసం స్నేహితులతో కలిసి వెతుకులాటలో ఉన్నాడు. ఈ క్రమంలో తన స్నేహితుడు అతీక్ తండ్రి వాచ్‌మెన్‌గా పనిచేసే జల్‌పల్లి కమాన్ రోడ్డులోని అక్తర్ హుస్సేన్ ఫాంహౌజ్‌కు సోమవారం సాయంత్రం భార్య, స్నేహితులు అఫ్జల్, అతీక్‌లతో కలిసి వెళ్లాడు. కాసేపయ్యాక హాజిరాబేగం వాచ్‌మెన్ గది వద్ద ఉండగా.. ఇద్దరు స్నేహితులు ఫాంహౌజ్‌లో తిరుగుతున్నారు. నియాజ్ ఫాంహౌజ్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లోకి దూకాడు. ఈత రాకపోవడంతో నీట మునిగి మృతి చెందాడు. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. మృతుడి సోదరుడు అర్బాజ్ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఒక్క ప్రసవం చేస్తే ఒట్టు..!

- రెండు పీహెచ్‌సీలు ఉన్నా జరగని కాన్పులు
- డెలివరీలన్నీ తాండూరు ఆస్పత్రికే రిఫర్
- ఓపీలకే పరిమితమైన ప్రాథమిక వైద్యం
- 24 గంటల వైద్య సేవలు మిథ్యే
- పట్టించుకోని జిల్లా వైద్యాధికారులు


బషీరాబాద్ పీహెచ్‌సీలో రోగులు లేక ఖాళీగా ఉన్న మంచాలు


బషీరాబాద్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

బషీరాబాద్: కర్ణాటక సరిహద్దులోని బషీరాబాద్ మండలంలో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నా ప్రసవాలు మాత్రం చేయడం లేదు. తాండూరు జిల్లా ఆస్పత్రికి 25కి.మీ. దూరంలో మండలం ఉండడంతో ఇక్కడి ప్రజలకు వైద్య సేవలు చేరువ చేయాలనే సంకల్పంతో బషీరాబాద్, నవల్గా గ్రామాల్లో పీహెచ్‌సీలను ఏర్పాటు చేశారు. బషీరాబాద్‌లో 24 గంటల వైద్య సేవలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఇక్కడి సిబ్బంది ఉదయం10కి వచ్చి సాయంత్రం 5గంటలకు ఇళ్లకు వెళ్లి పోతున్నారు. రాత్రి వేళ గర్భిణులు వచ్చినా, యాక్సిడెంట్ కేసులు, పాము కాటు కేసు బాధితులను తాండూరు జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు. ఇన్ పేషెంట్లు వస్తే సాయంత్రం వరకు వైద్యం చేసి రాత్రికి ఇంటికి పంపుతున్నారు. లేబర్ రూమ్ సరిగ్గా లేకపోవడంతో మూడు నెలలుగా ప్రసవాలు నిలిచిపోయాయి. కొంతమంది గర్భిణులు తాండూరు పీహెచ్‌సీలో, మరికొందరు ప్రైవేటు ఆస్పత్రుల్లో పురుడు పోసుకుంటున్నారు.

నవల్గాలో మరీ దారుణం

నవల్గా పీహెచ్‌సీలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఈ పీహెచ్‌సీ పరిధిలో మూడు గ్రామాలు ఉండగా ఒక్క కాన్పు కూడా జరగలేదు. అడపాదడపా వచ్చే రోగులకు ఓపీ చూసి సాయంత్రం కాగానే ఇంటి ముఖం పడుతున్నారు. దీంతో ప్రజలకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. ఏదైన ప్రమాదం జరిగితే తాండూరు వెళుతున్నారు కానీ, పీహెచ్‌సీకి రావడం లేదని ఆస్పత్రి వర్గాలే చెబుతున్నాయి. బషీరాబాద్ మెడికల్ అధికారిగా పనిచేస్తున్న వైద్యుడు గోపాల్ ఇక్కడ ఇన్‌చార్జ్ బాధ్యతలు చూస్తున్నాడు.

స్కానింగ్‌కు ప్రైవేటు సెంటర్లకు

మండలంలోని రెండు పీహెచ్‌సీల్లో అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్లు లేకపోవడంతో గర్భిణులు తాండూరులోని ప్రైవేటు ఆస్పత్రులకు వెళుతున్నారు. జిల్లా ఆస్పత్రిలోనూ ఒకే కేంద్రం ఉండడంతో అక్కడ స్కానింగ్‌కు సమయం పడుతోంది. దీంతో గర్భిణులు బయట కేంద్రాల బాట పడుతున్నారు. పీహెచ్‌సీల్లో స్కానింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

> **అత్యవసర వైద్యం అందడం లేదు**
>
> బషీరాబాద్ పీహెచ్‌సీలో 24 గంటలు వైద్య సేవలు అందించాల్సి ఉంది. అయితే ఇక్కడి సిబ్బంది ఆరేడు గంటలు మాత్రమే విధుల్లో ఉంటున్నారు. అత్యవసర వైద్యం అందడం లేదు. ప్రసవాల కోసం వచ్చినా, ప్రమాదాలు జరిగినా తాండూరు జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు. రాత్రి వేళ ప్రైవేటు ఆస్పత్రులే దిక్కవుతున్నాయి. గతంలో పాము కాటుకు గురైన యువకుడు ఆస్పత్రికి వస్తే ఇంజక్షన్ ఇచ్చేవారు లేక ప్రైవేటు ఆస్పత్రిలో చేరి మృతి చెందాడు.
>
> – లక్ష్మణ్, యువజన సంఘం నాయకుడు, బషీరాబాద్

రైతుకు వెన్నుదన్నుగా బీజేపీ

పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానంద్‌రెడ్డి


చక్రంపల్లిలో ఇంటింట ప్రచారం చేస్తున్న సదానంద్‌రెడ్డి తదితరులు

మోమిన్‌పేట: రైతుకు వెన్నుదన్నుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిలుస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానంద్‌రెడ్డిపేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చక్రంపల్లిలో మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఇంటింటికి బీజేపీ విజయాలు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కిసాన్ సమ్మాన్ నిధి కింద ఒక్కో రైతుకు రూ. 6వేలు అందిస్తోందన్నారు. పంట సాగు చేసేటప్పుడే మద్దతు ధర ప్రకటించి రైతుకు ధైర్యాన్ని ఇస్తున్నారని చెప్పారు. 70 సంవత్సరాల్లో సాధించని విజయాలను తొమ్మిదేళ్లలో సాధించినట్లు పేర్కొన్నారు. రక్షణ రంగంలో ఆయుధాలను ఎగుమతి చేసే స్థాయికి ఎదిగామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎల్ లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లేశం, బీజేవైఎం మండల అధ్యక్షుడు అశిరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, శివరాజ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తులు కూడబెట్టుకోవడానికే ప్రాధాన్యత


మాజీ మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

- సబ్సిడీలు ఎత్తేసి నట్టేట ముంచుతున్న ప్రభుత్వం
- మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

ధారూరు: వికారాబాద్ ఎమ్మెల్యే ఆస్తులు కూడబెట్టుకోవడానికే ప్రాధాన్యత ఇస్తూ.. గ్రామాల అభివృద్ధి మరిచారని మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ ఆరోపించారు. ధారూరు మండలం తరిగోపుల గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు మంగళవారం మాజీమంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే వికారాబాద్‌లో అభివృద్ధి జరిగిందని, ప్రస్తుతం జిల్లా పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. రవాణ సౌకర్యం కొరవడిందని, గుంతలమయమైన రోడ్లలో కనీసం మట్టి కూడా పోయలేని పరిస్థితిలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉందని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో ఏడాదిలో గ్రామానికి వంద ఇళ్లు మంజూరయ్యేవని, ఈ ప్రభుత్వంలో ఇళ్లు అనే మాట లేకుండా చేశారని మండిపడ్డారు. అన్నదాతలకు రైతుబీమా ఇస్తున్నట్లు చెబుతున్నా.. సబ్సిడీలు ఎత్తేసి నట్టేట ముంచుతున్నారని విమర్శించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు గడిల మల్లారెడ్డి, గఫార్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి పరులకే పదవులా?


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్

పరిగి: రాష్ట్రంలో అవినీతి పాలన సాగుతోందని, దోచుకున్న వారికే ప్రభుత్వం పదవులు ఇచ్చి మరింత దోపిడీకి సహకరిస్తోందని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్ ఆరోపించారు. ఈ నెల 30న నిర్వహించే చలో ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు బంధు ప్రీతితో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎన్నో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న శ్రీనివాస్‌రావుకు అంత పెద్ద పదవి ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. శ్రీనివాస్ అవినీతిపై పోరాడుతామన్నారు. ప్రభుత్వం స్పందించి అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సమితి రాష్ట్ర కార్యదర్శి గోవింద్ నాయక్, ప్రకాశ్, సూర్య నాయక్, శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తల్లడిల్లుతున్న తల్లి

జన్మనిచ్చిన పిల్లలకు కష్టం వస్తే ఆ తల్లి బాధలు వర్ణనాతీతం.. వారి బాధలు చూసినప్పుడల్లా పేగు బంధం తల్లడిల్లిపోతుంది.. ఓ వైపు ఆస్పత్రిలో చేరిన భర్త ఏమయ్యాడో తెలియదు.. మరో వైపు ఉన్న ఇద్దరు పిల్లలు దివ్యాంగులు కావడంతో ఆ తల్లి కన్నీటి పర్యంతమవుతోంది. ఇదీ ఓ మాతృమూర్తి భారతి దీన గాథ..

పిల్లలిద్దరూ దివ్యాంగులే
- సదరం సర్టిఫికెట్ల కోసం పాట్లు
- ఆస్పత్రిలో చేరిన భర్త ఏమయ్యాడో తెలియదు
- ఇదీ ఓ ఇల్లాలి దీనస్థితి


దివ్యాంగులైన ఇద్దరు పిల్లలతో తల్లి భారతి

తాండూరు రూరల్: మండలంలోని ఓగిపూర్‌కు చెందిన కుర్వ భారతి, పాండు దంపతులు. భారతిని బషీరాబాద్ మండలం నవాంద్గీ గ్రామానికి చెందిన పాండుకు ఇచ్చి వివాహం చేశారు. ఐదేళ్ల నుంచి భర్త కనిపించడం లేదు. దీంతో భారతి తల్లిగారి ఊరు ఓగిపూర్‌లో ఉంటోంది. ఈమెకు కూతురు అర్చన(13), కొడుకు మల్లేష్(9) ఉన్నారు. ఐదేళ్లు వచ్చే వరకు ఇద్దరూ బాగానే ఉండేవారు. ఆ తర్వాత ఒక్క సారిగా జ్వరం వచ్చి నడవలేని స్థితికి చేరారు. పిల్లల్లో ఎదుగుదల లోపించిందని తల్లి ఆవేదన చెందుతోంది. లివర్ సంబంధిత వ్యాధిలో బాధపడుతున్న భర్త పాండును లాక్‌డౌన్‌కు ముందు ఆస్పత్రిలో చేర్పించింది. అప్పటి నుంచి ఇంటికి రాలేదని, ఉన్నడో.. చనిపోయాడో తెలియడం లేదని భారతి బోరున విలపిస్తోంది. ప్రస్తుతం పిల్లలిద్దరిని తన తల్లి ఎల్లమ్మ వద్ద ఉంచి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. దివ్యాంగులైన పిల్లలకు పింఛన్ వస్తే కొంత మేలు జరుగుతుందని భావిస్తోంది. పింఛను మంజూరు కావాలంటే సదరం సర్టిఫికెట్ తప్పని సరి అని అధికారులు చెప్పడంతో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతోంది. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి తన ఇద్దరు పిల్లలకు సదరం సర్టిఫికెట్ ఇప్పించి పెన్షన్ వచ్చేలా చూడాలనిభారతిదీనంగా వేడుకుంటోంది.

పుష్కరకాలం.. నిరుపయోగం


ముళ్లపొదలతో బూతు బంగ్లాను తలపిస్తున్న పాఠశాల భవనం

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడమే గగనం.. అలాంటిది వచ్చిన నిధులను భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగపడేలా వినియోగించాలి.. కానీ అధికారుల అవగాహన లోపం వల్ల లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. ఇందుకు నిదర్శనం బంట్వారం మండలం తొర్మామిడి గ్రామంలోని పాఠశాల భవనమే..

- ఊరికి దూరంగా పాఠశాల భవన నిర్మాణం
- రూ.30 లక్షల ప్రజాధనం వృథా
- నెరవేరని ప్రభుత్వ ఆశయం

బంట్వారం: మండలంలోని తొర్మామిడిలో ఊరికి దూరంగా నిర్మించిన పాఠశాల భవనం పుష్కరకాలంగా నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ఏళ్ల తరబడి వినియోగంలో లేకపోవడంతో పిచ్చిమొక్కలతో బూత్ బంగ్లాను తలపిస్తోంది. గ్రామానికి దూరంగా భవనం నిర్మించడం వల్లే ఈ పరిస్థితి నెలకొన్నట్లు తెలిసింది. 2009లో తొర్మామిడి గ్రామానికి ప్రభుత్వం పాఠశాలను మంజూరు చేసింది. భవన నిర్మాణం కోసం రూ. 30లక్షలు విడుదల చేసింది. పనులు పూర్తి కావడంతో 13 ఏళ్ల క్రితం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఉన్న పట్నం సునీతారెడ్డి ప్రారంభించారు. ఈ భవనంలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేశారు. దీంతో గ్రామంలోని పాత భవనాన్ని ప్రాథమిక పాఠశాలకు కేటాయించారు. ఇంతవరకు బాగానే ఉన్నా గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో పాఠశాల ఉండడంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లడం మానేశారు. విషయం తెలుసుకున్న అధికారులు గ్రామంలోని పాత భవనంలోకే పాఠశాలను మార్చారు. దీంతో రూ. 30 లక్షల ప్రజాధనం వృథాగా మారింది. ప్రస్తుతం భవనం శిథిలావస్థకు చేరింది. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న భవనాన్ని సొంత భవనం లేని శాఖలకు కేటాయిస్తే ప్రయోజనం చేకూరుతుందని స్థానికులు అంటున్నారు.

> **అధికారుల దృష్టికి తీసుకెళ్తా**
>
> 
>
> నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల భవన విషయాన్ని విద్యా శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. గ్రామానికి మూడు కిలో మీటర్ల దూరంలో పాఠశాల భవనం నిర్మించడం వల్లే దాన్ని ఉపయోగించలేక పోయారు.
>
> – చంద్రప్ప, ఎంఈఓ

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దోమ: పురుగు మందు తాగి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన దోమ పోలీస్ స్టేషన్ పరిధిలోని మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ విశ్వజన్ తెలిపిన వివరాలు తిమ్మాయిపల్లికి చెందిన మక్సూద్(32) మద్యానికి బానిసై భార్య సమీనాబేగంతో గొడవ పడేవాడు. ఈ నెల 24న మద్యం తాగి భార్యతో గొడవ పడి పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వికారాబాద్‌కు, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తమ్ముడు మహిమూద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విశ్వజన్ తెలిపారు.

పాతికేళ్లుగా యువతకు అండగా..

ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

తాండూరు: పాతికేళ్ల తన రాజకీయ ప్రస్థానంలో ఈ ప్రాంత యువతకు అధిక ప్రాధాన్యత ఇచ్చానని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాండూరులోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. ఎన్నికల సమయంలో రాజకీయ లబ్ధి కోసం కొందరు ట్రస్టులు పెట్టి ఆ తర్వాత ఎత్తేయడం పరిపాటిగా మారిందన్నారు. అయితే తాను పీజేఆర్ ట్రస్ట్ ద్వారా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఇటీవల పలు మండలాల్లో తన తనయుడు పట్నం రినీష్‌రెడ్డి ఆధ్వర్యంలో పీఎంఆర్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించినట్లు తెలిపారు. విజేత జట్లకు బుధవారం తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బహుమతుల ప్రదానం చేయనున్నట్లు వివరించారు. వచ్చే నెల నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తామన్నారు. కార్యక్రమంలో బషీరాబాద్ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ జుబేర్‌లాల, యాలాల మాజీ ఎంపీపీ పురుషోత్తం రావు, నాయకులు శ్రీనివాస్, రఘు, రాకేష్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికం.. అనర్థం



- పరిమితికి మించి ఎరువులు వాడితే ముప్పే
- సేంద్రియ సాగు మేలంటున్న అధికారులు

నవాబుపేట: రసాయన ఎరువులు అధికంగా వాడితే అనర్థమే అని వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా దిగుబడి తగ్గి, పెట్టుబడులు పెరుగుతాయని అంటున్నారు. సాధారణంగా నేల స్వభావం, భూసారాన్ని బట్టి ఎరువులు వాడాలి. కానీ రైతులంతా ఒకే రకమైన ఎరువులను వినియోగిస్తున్నారు. వరి సాగులో ఎకరాకు 50కేజీల డీఏపీ, 100 కేజీల యూరియా వాడాలి. కానీ రైతులు ఎకరాకు రెండు బస్తాలకు తగ్గకుండా డీఏపీ వేస్తున్నారు. పైరు నాటే సమయంలో బస్తాకు అదనంగా 25 కేజీల పొటాష్‌ను కలిపి వేయాల్సి ఉన్నా రైతులు వేయడం లేదు. వరికి యూరియాను నాలుగు సార్లు వాడాలి. వాడిన ప్రతి సారి 30 కేజీల చొప్పున వాడాలి. పొట్టదశలో యూరియాకు 25 కేజీల పొటాష్‌ను కలిపి వాడాలి. అయితే రైతులు చాలా వరకు నాటిన 20 రోజులకు 50 కేజీలు, మధ్యలో 50 కేజీలు వాడుతున్నారు. ఇక పత్తి పంట విషయానికి వస్తే విత్తేకంటే ముందే ఎకరాకు మూడు నాలుగు అంగుళాల లోతున పడేలా 50 కేజీల డీఏపీ వాడాలి. అయితే వర్షాధారంగా సాగు చేసే పంటల్లో విత్తనాలు మొలుస్తాయో లేదోనని పత్తి విత్తేటప్పుడు ఎరువులు వేయడం లేదు. కనీసం 25సెం.మీ. లోతులో భూమిలో పదును ఉండేలా వర్షం పడినప్పుడు ఎరువుతో పాటు పత్తి గింజలు వేస్తే మంచి ఫలితం ఉంటుంది. పత్తితో పాటు అన్ని ఖరీఫ్ పంటలకు 50 కేజీల వరకు మాత్రమే డీఏపీ వాడాలి. అయితే రైతులు పైరు ఎదుగుదల దశలో రెండు మూడు బస్తాలు వరకు డీఏపీని పైపాటుగా చల్లుతున్నారు. దీని వల్ల అంతగా ప్రయోజనం ఉండదు. పోషకాలు ఉన్న కాంప్లెక్స్ ఎరువులు రెండు బస్తాలు వాడితే సరిపోతుంది.

అధిక భాస్వరంతో నష్టం


అధిక మోతాదులో భాస్వరం వాడడం వల్ల దిగుబడులపై క్రమంగా తీవ్ర ప్రభావం చూపుతుంది. తొలి రెండేళ్ల పాటు దిగుబడులు బాగా వచ్చినా ఆ తర్వాత ఎరువులు వాడినా దిగుబడులు రానంతగా నేల దెబ్బతింటుంది. భాస్వరం భూమి లోపలి పొరల్లో నిల్వ ఉండి నేల గట్టిగా మారి పంటలకు నష్టం కలిగిస్తుంది.

సమతూల్యత ఏది?

ప్రతి మొక్కకూ నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులతో పాటు సూక్ష్మ పోషకాలు కూడా అవసరం. రైతులు అవగాహన లోపంతో కొన్ని రకాల కాంప్లెక్స్ ఎరువుల్లో ఉండని పోషకాలను అదనంగా చేర్చి వాడాల్సిన విషయం రైతులకు తెలియదు. ఉదాహరణకు 28 – 28 – 0, డీఏపీలోను పొటాష్ ఉండదు. ఈ ఎరువులు వినియోగించినప్పుడు పైరు ఎదుగుదల దశలో పైపాటుగా యూరియాను వాడాలి. దుక్కిలో కాంప్లెక్స్ ఎరువులు వాడాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నా పైపాటుగా కూడా వాడుతుండడంతో ఎరువుల్లో పోషకాలు సరిగ్గా మొక్కకు చేరక వృథా అవుతున్నాయి. సూక్ష్మ పోషకాల అవసరాన్ని రైతులు గుర్తించకపోవడంతో పంటల్లో దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నాయి.

సేంద్రియ ఎరువులు తప్పని సరి

రైతులు రసాయన, సేంద్రియ ఎరువులు సగం మోతాదులో వాడాల్సి ఉంది. కేవలం రసాయన ఎరువులే వాడటం వల్ల భూ సారం తగ్గిపోయి నిస్సారంగా మారుతుంది. మొదట్లో బాగానే దిగుబడులు వచ్చినా క్రమంగా భూ సారం తగ్గి దిగుబడులు రావు. సేంద్రియ ఎరువులు వాడడం వల్ల బరువు నేలలు గుల్ల బారి వేర్లు చక్కగా పెరగటానికి సహాయపడుతుంది.

> **అవగాహన కల్పిస్తున్నాం**
>
> 
>
> ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మోతాదుకు మించి ఎరువులు వాడడం వల్ల కలిగే నష్టాన్ని తెలియజేస్తున్నాం. ఏ పంటకు ఏ సమయంలో ఎంత ఎరువు వాడాలి అనేది తెలిస్తే పంట దిగుబడిలో ప్రయోజనం కనిపిస్తుంది. ఆ దిశగా రైతులకు సూచనలు ఇస్తున్నాం. అంతేకాకుండా భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్నాం.
>
> – ప్రసన్నలక్ష్మి, ఏఓ

గొర్రెల యూనిట్లతో ఆర్థికంగా ఎదగాలి


గొర్రెలను పరిశీలిస్తున్న అనిల్‌కుమార్

అనంతగిరి: మండలంలోని కొటాలగుడెంలో 24మంది లబ్ధిదారులకు మంజూరైన గొర్రెల యూనిట్లను మంగళవారం జిల్లా పశువైద్యాధికారి అనిల్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొటాలగుడెం గ్రామంలోని 24మందికి గొర్రెల యూనిట్లు మంజూరు కాగా అందులో 12 యూనిట్లను పరిశీలించడం జరిగిందన్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున జీవాలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. ముందస్తు చర్యలతో గొర్రెలను కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం అందజేసిన ఈ పథకంతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి ఉష, సర్పంచ్ రాములు నాయక్, వీఎల్ఓ సురేందర్, గొర్రెల సొసైటీ సంఘం అధ్యక్షుడు బీరప్ప, నాయకులు మహేశ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.